# 'ప్రసాద్గారు'

మా స్కూలుకు చాలా పెద్ద లైబ్రరీ ఉండేది. ఆ లైబ్రరీకి ప్రసాద్గారు లైబ్రేరియన్. స్కూల్లో చేరిన కొత్తలో కనీసం ఓ గంట లైబ్రరీలో గడిపేవాళ్లం. ఇప్పుడా లైబ్రరీ బాగా చిక్కిపోయిందని విన్నాను.

లైబ్రేరియన్ ప్రసాద్గారు బీఎస్సీ చదివాడు. ఆయనకు లైబ్రరీలో వున్న పుస్తకాల పట్ల శ్రద్ధకంటే వేరే విషయాలపై శ్రద్ధ ఎక్కువగా వుండేది. ఏవేవో స్పేర్ పార్ట్‌లు తెచ్చి చిన్నచిన్న రేడియోలు అసెంబుల్ చేస్తూండేవాడు. ఓ మాటు మూణ్ణెల్లు కష్టపడి ఓ గ్రామఫోను అసెంబుల్ చేసాడు. అదీ కీ యిచ్చేది. ముళ్లు కూడా మార్చాలి. చిన్న అట్టపెట్టెలో గ్రామఫోను ముళ్లు వచ్చేవి. ప్రసాద్గారు తయారుచేసిన గ్రామఫోను ఆన్చేస్తే వేగంగా కిచకిచమంటూనో... లేదా నెమ్మదిగా బండగొంతుతో లాగబడో పాటలు వచ్చేవి. ప్రసాద్గారు దగ్గర రెండే రెండు రికార్డులుండేవి. ఒకటి నాగయ్యది. ఇంకోటి ఈలపాట రఘురామయ్యదీనూ.. అవి రెండూ మార్చిమార్చి వేసేవాడు. నాగయ్యా... రఘురామయ్య ప్రసాద్గారు గ్రామఫోను తమాషాగా వుండేది. రెండురోజులకోమారు ఆయన ఆ గ్రామఫోన్ను ముక్కలు ముక్కలుగా విడగొట్టడం మళ్లీ తయారుచేయడం. ఇట్లా ఆయన రిపేరీల్లో మునిగి తేలుతోంటే పుస్తకాలు దొడ్డిదోవన బైటకు చేరవేసే వాళ్లుచేరవేయడం. అట్లా పుస్తకాల్ని తస్కరించిన ఘనుల్లో ఇద్దరు టీచర్లే కావడం విశేషం (ఆ యిద్దరూ కాలం చేసారు కాబట్టి వాళ్ల పేర్లు రాయట్లేదు) లైబ్రరీలో ఇంకోమూలకి డ్రాయింగ్ మాస్టారు దక్షిణామూర్తి సిగరెట్లు కాలుస్తూ బొమ్మ గీస్తూండేవారు.

సరే ప్రసాద్గారు మాత్రం చాలచాల మంచివాడు. మంచివాణ్ణి మన మామూలు సమాజమేమంటుందండీ? తెల్సిందేకదా 'పిచ్చివాడు' అనంటుంది. అదే మా ప్రసాద్గారుకు స్థిరమైపోయింది. మా స్కూలు బైట ఓ పెద్ద పాకలో ఓ మలయాళీ కుటుంబం నివసిస్తూ అందులోనే హోటలు నడిపేవారు. 'స్వామి క్యాంటీన్' అని దాని పేరు. ఆ స్వామి క్యాంటీన్‌లోనే ప్రసాద్గారు కాఫీ, టిఫిన్లూ, భోజనమూ... ఆయనకో ఖాతా వుండేది. చాలామంది ఆయన మంచితనాన్ని ఆసరా చేసుకుని ఆయన ఖాతాలోనే కాఫీ, టిఫిన్లు చేసేసేవాళ్లు. ప్రసాద్గారుకి నెలలో రెండోవారానికే జీతం 'ఫట్'. ఇక అప్పట్నించీ పెద్ద తరగతి స్టూడెంట్లని "ఒరేయ్ ఓ పది రూపాయలివ్వరా ఫస్ట్‌కిస్తా" అంటూ అప్పులు.

ఆయన పతనం అలా మొదలైంది. అందరూ అన్నిటికీ ఆయన్ని వాడుకునేవారు. బ్రహ్మచారి అమాయికుడూ పైగా 'మంచివాడు' కదా.

నేను పేపరు మిల్లులో కాంట్రాక్టు చేస్తూన్నప్పుడు ఓరోజున ఓ సైకిలు షాపు దగ్గర ఓ కుర్ర టీచరు నిలబడి జల్సాగా సిగరెట్ కాలుస్తూ ప్రసాద్సారుతో సైకిలుకి గాలి కొట్టిస్తూ కనబడ్డాడు. నాకు మండి వెళ్లి నేను గాలి కొట్టి ఆ కుర్ర టీచర్ను మొహం వాచేట్లు చివాట్లు పెట్టి, ప్రసాద్సారును కూడా మందలించా... "ఏమైంది తీరా సైకిల్లో జిల్లా పరిషత్తు వరకూ తీసుకుపోతున్నాడు" అన్నాడు.

అదీ ఆయన పిచ్చితనం.

రానురాను ఆయన హయాంలో లైబ్రరీలో చాలా పుస్తకాలు మాయమైపోయాయి. వాటి రికవరీ కింద చాలా జీతం పోయేది. తనకు అలాట్ అయిన గవర్నమెంట్ క్వార్టర్సు యింకో టీచరుకి అద్దెకిచ్చి వరండాలో పడుకునేవాడు. రిటైరయ్యాక ఆ సౌలభ్యమూ పోయింది. దాదాపు రోడ్డును పడ్డాడు. అయినవాళ్లు అన్నదమ్ములూ వున్నారని వినికిడి. వినికిడేమిటి.... పెద్ద హోదాల్లో వున్నారు కానీ ఎవ్వరూ ఈయిన్ని కలవడానికి ఎప్పుడూ రాలేదు. పాత స్టూడెంటు ఎవరు కనబడినా డబ్బు అడగడం... లేదా టిఫిన్ పెట్టించ మనడం చేసేవాడు.

※ ※ ※

కొద్దిరోజుల క్రితం నా జూనియర్ ఒకడొచ్చి "అన్నా! ప్రసాద్సారు చనిపోయినాడు అందరం కలిసి చందాలు వేసుకొని అంత్యక్రియలు చేస్తున్నాం. ఏమైనా యివ్వు" అని నేనిచ్చిన డబ్బు తీసుకువెళ్లిపోయాడు.

అనాథగా ఎవరి పంచలోనో పదిపదిహేనురోజులు తీసుకు తీసుకు చనిపోయాట్ట. అన్నదమ్ములూ బంధువులూ వుండి కూడా అనాథగానే బ్రతికిన ప్రసాద్సారు మరణంలో కూడా అనాథగానే మిగిలాడు.

అయితే నాదగ్గర ప్రసాద్సారు అంత్యక్రియలని డబ్బు తీసుకెళ్లినవాడు సాయంత్రం మళ్లీ వచ్చి డబ్బు వెనక్కి యిచ్చి "బ్రాహ్మణ సంఘం వాళ్లొచ్చారన్నా... ప్రసాద్సారు బ్రాహ్మిన్ అంట... అన్నీ శాస్త్రప్రకారం చేయాలని వాళ్లే చేసారు" అన్నాడు. నవ్వొచ్చింది నాకు. చనిపోయేనాటి వరకూ చాలామందికి ప్రసాద్సారు కులం తెలియదు. అతి దయనీయంగా బ్రతికిన ఆయనకు జీవనానికీ జీవితానికీ సాయపడని కులం చావులో మాత్రం సాంప్రదాయబద్ధంగా సాయపడింది.

※ ※ ※

పాలు పెరుగు పాయసాన్నము నెయ్యి
జున్ను లెన్నియైన చూడ పాలె
పాలవంటి కులము బ్రహ్మంబుగానరో... -వేమన్నా!
ఏమన్నా యిదీ? ●